క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

ఈపూరు: అక్రమంగా నిల్వ ఉంచి రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు పట్టుకున్న సంఘటన శుక్రవారం జరిగింది. ముప్పాళ్ల గ్రామంలో రేషన్ షాపుకి చెందిన వాహనంలో కొన్ని పీడీఎస్ బియ్యం బస్తాలు డి.సురేష్‌కు చెందిన ఇంటికి చేరవేసినట్లు గ్రామస్తులు కొందరు దానిని చూసి వీఆర్‌వో ఎస్‌కే అబ్దుల్ నబికి సమాచారం అందించారు. దీంతో వీఆర్‌ఏ జాన్‌సైదాతో కలిసి ఆయన సంఘటనా స్థలానికి వెళ్లి తనిఖీ చేయగా 36 పీడీఎస్ బియ్యం బ్యాగులు ఇంట్లోకి చేరవేసినట్లు గుర్తించారు. ఈ బియ్యం ముప్పాళ్ల గ్రామంలోని రేషన్‌షాపు డీలర్ కె.శ్రీనివాసరావుకు చెందినవనిగా విచారణలో తెలిసింది. పీడీఎస్ బియ్యంపై అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్‌వారికి రిపోర్ట్ చేయగా ముద్దాయిలు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వీఆర్‌వో తెలిపారు.

రాజమహేంద్రవరంలో పోట్లూరి విద్యార్థి మృతి



శావల్యాపురం: రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థులు ఇద్దరు దుర్మరణం చెందారు. వివరాలు మేరకు పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం పోట్లూరు గ్రామానికి చెందిన చింతా కార్తీక్ (పోట్లూరు) తన స్నేహితుడు రోణింగి ప్రవీణ్ కుమార్‌లు (శ్రీకాకుళం) రాజమండ్రిలోని గైట్ కళాశాలలో చదువుతున్నారు. కళాశాల నుంచి జాతీయ రహదారి మార్గంలో బైకుపై టిఫిన్ చేయటానికి బయలు దేరారు. మార్గమధ్యంలో తమిళనాడు రాష్ట్రం నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న లారీ అతి వేగంతో బైకును వెనుక నుంచి ఢీకొట్టటంతో ఇరువురు విద్యార్థులు జాతీయ రహదారి మార్గంలో మృత్యువాత పడ్డారు. చింతా కార్తీక్ (19) బిటెక్ రెండవ సంవత్సరం (సీఎస్‌సీ) చదువుతున్నాడు. చింతా వీరాంజినేయులు–రాధ దంపతులకు ఇరువురు సంతానం కాగా అందులో రెండవ సంతానం కార్తీక్. వ్యవసాయం చేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నారు. శవపంచనామా అనంతరం పోలీసులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. చింతా కార్తీక్ అకాల మృతికి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు స్నేహితులు, కన్నీటి పర్యం

ముగ్గురు దొంగల అరెస్టు

చిలకలూరిపేట: స్కూటీల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురిని అర్బన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అర్బన్ సీఐ పి రమేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురంకు చెందిన కత్తి శివ, క్రీస్తు కాలనీకి చెందిన తన్నీరు ఉమా శంకర్, పెదనందిపాడు రోడ్డులో నివాసం ఉండే ఒంటిపులి నరేంద్ర బాబు గత కొంతకాలంగా ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ముగ్గురు మూడు వాహనాలపై అనుమానాస్పదంగా చిక్కారు. వీరిని విచారించి మూడు వాహనాలతో పాటు వేలూరు రోడ్డులోని ముళ్ల పొదల్లో దాచిపెట్టిన వాహనాలు కలిపి మొత్తం ఎనిమిది స్కూటీలు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. వాహన తనిఖీల్లో పాల్గొన్న పట్టణ ఎస్ఐ డి.చెన్నకేశవులు, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

నిరుపేద కుటుంబానికి సాయం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో పేద బ్రాహ్మణ కుటుంబానికి గ్రామపెద్దలు, నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం సారథ్యంలో తమ వంతు ఆర్థిక చేయూత కార్యక్రమం నిర్వహించారు. వివరాలు మేరకు గ్రామానికి చెందిన పేటేటి నాగ శ్రీరామమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. దీంతో నియోజకవర్గ బ్రాహ్మణ సంఘం సారథ్యంలో రూ. లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేయగా గ్రామస్తులు సౌజన్యంతో పార్టీలకు అతీతంగా మరో రూ. 3 లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం చేయడానికి ఆర్థిక సహాయం అందజేయటం అభినందనీయమని బ్రాహ్మణ సంఘం నేత పీవీ సురేష్‌బాబు వెల్లడించారు. అలాగే ఆ కుటుంబంలోని పాపకు విద్య పరంగా 7 నుంచి 10 తరగతి వరకు హాస్టల్ వసతి కల్పిస్తామని గాయత్రి స్కూల్ శర్మ, మానవ సేవా సమితి సీహెచ్.భవాని శంకర్‌లు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జీవి రమణరావు, గాలి శ్రీనివాసరావు, ధూళిపాల నాగేశ్వరరావు, యరమాసు కోటేశ్వరరావు, గోపాలం శివయ్య, పులిపాక హనుమంతరావు పాల్గొన్నారు.





వ్రతానికి వేళాయె!



నరసరావుపేటలో క్రేన్ సాయంతో వినాయక ప్రతిమను లారీలో నిలబెడుతున్న దృశ్యం



నరసరావుపేటలో వినాయక ప్రతిమను ఆటోలో ఎక్కిస్తున్న కమిటీ సభ్యులు



గణపవరం శాంతినగర్‌లో చలువ పందిరిలో కొలువుదీరిన గణనాథుడు



మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమలను ప్రదర్శిస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు



నరసరావుపేటలో చిరుజల్లుల కారణంగా టార్పాలిన్ కవర్లతో వినాయక ప్రతిమలను తరలిస్తున్న నిర్వాహకులు

కోర్టు ఆవరణలో కంటి వైద్య శిబిరం



అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సృజన

నరసరావుపేట టౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ఆవరణలో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ ప్రారంభించారు. ఎంవి రెడ్డి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎల్. సృజన పాల్గొని న్యాయమూర్తులకు, న్యాయశాఖ సిబ్బందికి కంటి పరీక్ష నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. కంటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో న్యాయమూర్తులు, కోర్టు, వైద్యశాల సిబ్బంది, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు .

సంతకం పెట్టలేదని రైతు నిరసన

- పొలానికి విద్యుత్ కనెక్షన్ కోసం తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొన్న రైతు
- ఎస్ఐ జోక్యంతో ముగిసిన వివాదం



కారుకు అడ్డంగా కూర్చున్న రైతు కంచేటి చంద్రరావు

ఈపూరు: రెవెన్యూ అధికారులు తమ పద్ధతులను ఏ మాత్రం మార్చుకోవడం లేదు. రైతులను తమ కార్యాలయాల చుట్టూ పదేపదే తిప్పుకోవడం అలవాటుగా మారింది. దీనికి నిదర్శనం ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన రైతు కంచేటి చంద్రరావుది ఉదాహరణగా చెప్పుకోవచ్చు. చంద్రరావు చిట్టాపురం రెవెన్యూ పరిధిలోని ఎల్‌పీ నం. 206లో 2.90 ఎకరాల భూమి ఉంది. అయితే ఆ భూమిలో విద్యుత్ కనెక్షన్ కోసం శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయానికి తహసీల్దార్ సంతకం కోసం రాగా ఎంక్వయిరీ కోసం తహసీల్దార్ నళిని వీఆర్వో నబిని పంపారు. గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించి వివరాలు నమోదు చేసుకొని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సిబ్బంది వివరాలు అందించినప్పటికీ తహసీల్దార్ నళిని 5గంటలు దాటిన తరువాత నేను సంతకాలు పెట్టనని ససేమిరా అని కారులో తహసీల్దార్ బయలుదేరుతుండటంతో అందుకు ఆగ్రహించిన రైతు కంచేటి చంద్రరావు గేటుకు అడ్డంగా కూర్చొని కారును పోనివ్వనని నిరసన తెలిపారు. సుమారు అరగంట సేపు నిరసన వ్యక్తం చేశారు. తనను మధ్యాహ్నం నుంచి కార్యాలయంలో వేచి ఉంచి ఇప్పుడు 5 గంటలు దాటింది.. సంతకాలు పెట్టనని అనడం ఏమిటని ప్రశ్నించారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు అక్కడికి చేరుకొని చంద్రరావు నిరసనను విరమింప జేసి ఇరువురి మధ్య సయోధ్య కుదుర్చడంతో అప్పుడు తహసీల్దార్ నళిని చంద్రరావు దరఖాస్తుపై సంతకాలు పెట్టారు.

ఆపన్న హస్తం



విజయవాడ వరద నీటిలో ఆహారపొట్లాలను తీసుకెళుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



బాధితులకు సరుకులు అందజేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ నాయకులు

ఎందుకు పారేశారో?



తుఫాను కారణంగా పోటెత్తిన వరద విజయవాడ నగరాన్ని ముంచెత్తి విలయ తాండవం చేయటంతో లక్షల మంది ప్రజలు ఆహారం దొరక్క అలమటిస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటూ స్వచ్ఛంద సంస్థలు, ఇతర ప్రాంతాలకు చెందిన దాతలు ఆహారం, పాలు, నిత్యావసరాలను బాధిత ప్రజలకు ఉదారంగా సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం బండెడంత ఆహారం చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో రోడ్డు పాలైన సంఘటన చూపరులను జాలిగొలిపింది. తయారు చేసిన ఆహారంలో లోపమో, మరొక కారణమో తెలియదు కానీ గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన పడవేసి వెళ్ళారు. పార్శిల్ డబ్బాల్లోని పదార్థాం చిందరవందరగా పడవేశారు. కొందరు పారిశుధ్య కార్మికులు ఆహారాన్ని పడవేసి ప్లాస్టిక్ డబ్బాలను ఏరుకుంటూ కనిపించారు. –నాదెండ్ల

ఫిజియోథెరపికి ప్రత్యేక స్థానం

నరసరావుపేట ఈస్ట్: వైద్యసేవలో ఫిజియోథెరపీ విభాగానికి ప్రత్యేక స్థానం ఉందని పలువురు వక్తలు తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో శుక్రవారం ఫిజియోథెరపీ డే ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఫిజియో ప్రిన్సిపల్ వేణుగోపాలరెడ్డి విద్యార్థులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయ గుప్త, సీనియర్ ఫిజియోథెరపిస్ట్ బి.వేమారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, ఫిజియో కళాశాల ఏఓ ఏవిఎన్.గుప్త, అధ్యాపకులు పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

వరద బాధితులకు ఈశ్వర్ కళాశాల సాయం



నరసరావుపేట రూరల్: విజయవాడలోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు ముందుకు వచ్చారు. విజయవాడలోని రామకృష్ణాపురం, పరిసర ప్రాంతాల్లోని 500 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం కళాశాల నుంచి నిత్యావసర సరుకులతో కూడిన ప్రత్యేక వాహనం బయలుదేరి వెళ్లింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కార్యదర్శి షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్‌షరీఫ్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ హెచ్ గంగాధర్ పాల్గొన్నారు.